క్లుప్తంగా

వీవీఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



పెదకాకాని: వీవీఐటీ విశ్వవిద్యాలయంలోని మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన అధ్యాపకుడు దాది వెంకట శేషగిరిరావు డాక్టరేట్ అందుకున్నాడు. సంకలిత తయారీపై చేసిన పరిశోధనలకుగాను అన్నామలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ శ్రీ వాసిరెడ్డి విద్యాసాగర్ మంగళవారం తెలిపారు. లేజర్ పౌడర్, బెడ్ ఫ్యూజన్ ద్వారా తయారు చేయబడిన కోబాల్ట్ క్రోమ్ మాలిబ్డినం మిశ్రమలోహాలంతో తక్కువ బరువు, ఖర్చుతో బయో ఇంప్లాంట్ తయారీపై చేసిన పరిశోధనా పత్రాలను ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.రాజు పర్యవేక్షణలో అందించడం ద్వారా ఈ డాక్టరేట్ పొందినట్లుగా తెలిపారు. దాది వెంకట శేషగిరిరావును చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, మెకానికల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాసరావు, ఎం.కెధార్ మల్లిక్ అభినందించారు.

శివాలయంలో వీరంగంపై చర్యలు తీసుకోవాలి

పెదకాకాని: శివాలయంలో మద్యం మత్తులో వీరంగం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని విశ్వ హిందూ పరిషత్ ఐక్యవేదిక ప్రతినిధులు ఆలయ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలోని భోజనశాల వద్దకు ఆదివారం పెదకాకాని చెందిన వ్యక్తి వచ్చి భోజనం పెట్టాలని సిబ్బందితో వాదనకు దిగాడు. మద్యం తాగి ఆలయంలోకి రాకూడదని సిబ్బంది ఎంత చెప్పినా ఫోన్‌లో ఫొటోలు తీస్తూ బెదిరిస్తూ అక్కడ భోజనం చేసే భక్తులను అసౌకర్యానికి గురిచేశాడు. ఈ వ్యవహారంపై మంగళవారం శివాలయం డెప్యూటీ కమీషనర్ గోగినేని లీలాకుమార్‌ను కలిసిన విశ్వ హిందూ పరిషత్ సభ్యులు మద్యం తాగి ఆలయ ప్రాంగణంలోకి రావడంతో పాటు వీరంగం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

వంట ఏజెన్సీలకు వేతనాలు విడుదల చేయాలి

కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్న నిర్వాహకులకు వెంటనే బిల్లులు చెల్లించాలని సీఐటీయూ మండల మహిళా అధ్యక్షురాలు మర్రి లక్ష్మి కోరారు. పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో సంఘం మండల సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా యూనియన్ జిల్లా నాయకులు షేక్ షమీ మాట్లాడుతూ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు గత 8 నెలల నుంచి మధ్యాహ్న భోజన బిల్లులు జమ కాలేదని చెప్పారు. విద్యార్థికి రూ.8.50 మాత్రమే ప్రభుత్వం చెల్లింస్తుందని అది కూడా సకాలంలో చెల్లించకపోవడంతో నిర్వాహకులకు ఇబ్బందులు తప్పడం లేదని పేర్కొన్నారు. విద్యార్థికి రూ.20 చెల్లించాలని అది కూడా నెల నెలా నగదు విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో సభ్యులు అనూష, సుజాత, రాధ, లలిత కుమారి, శివలీల, జ్యోతి కుమారి, అరుణ, విజయలక్ష్మి, దొప్పలపూడి రమేష్, కొత్త వెంకట శివరావు, రామారావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

27న చేబ్రోలులో జాబ్ మేళా

చేబ్రోలు: మండల కేంద్రమైన చేబ్రోలులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా గురువారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ వీ శ్రీదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆక్టో సాఫ్ట్ సొల్యూషన్స్, జెడ్ ఎమ్ క్యూర్, ఆన్వోవాసోర్స్, అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, సువర్ణ కుటీర్ డెవలపర్ కంపెనీలు హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమో, డిగ్రీ ఆపైన విద్యార్హత కలిగిన ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఉద్యోగ మేళాలో పాల్గొనాల్సింది కోరారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

మహాభారతం అరణ్య పర్వంపై ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం సాయంత్రం మహాభారతం అరణ్య పర్వంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. ఆలయ ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. అర్జునుడు పాశుపతాస్త్రాన్ని పొందిన విధానం, తర్వాత స్వర్గానికి వెళ్లి తన తండ్రి ఇంద్రుని కలిసిన విశేషాలను గుదిమెళ్ల కూర్మనాథస్వామి వివరించారు.

మున్సిపాలిటీలో ఇష్టారాజ్యం!

- ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికార యంత్రాంగం
- ఇష్టారాజ్యంగా ఆశీలు లీజు కేటాయింపులు
- ఆదాయాన్ని కోల్పోతున్న వైనం



పొన్నూరు పురపాలక సంఘ కార్యాలయం

పొన్నూరు: మున్సిపాలిటీలో పాలన గాడి తప్పింది. అధికారులు ఇష్టారాజ్యం అయిపోయింది. కూటమి పాలనలో పర్యవేక్షణ లేకుండా పోయింది. ఆదాయానికి గండిపడతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు.

గ'లీజు' పనులు...

పురపాలక సంఘానికి ప్రధాన ఆదాయ వనరులైన కూరగాయల మార్కెట్, సంద్రి మార్కెట్, మాంసం మార్కెట్, చేపల మార్కెట్, జంతు వధశాల నుంచి లీజు రూపేణా ప్రతి ఏటా రూ.లక్షల ఆదాయం సమకూరుతోంది. బహిరంగ వేలం ద్వారా లీజు కేటాయింపులు చేయడం ఆనవాయితీ. ఈ ప్రక్రియకు కొన్ని రోజుల ముందు వేలం పాట విషయాన్ని వ్యాపారులకు తెలియజేసేందుకు మైక్ ప్రచారంతో పాటు ప్రముఖ దినపత్రికలలో టెండర్ నోటీసులు ప్రకటిస్తారు. బహిరంగ వేలం పాటలో అనేక మంది వ్యాపారులు పాల్గొని టెండర్లను దక్కించుకునే క్రమంలో అధిక మొత్తంలో చెల్లించే విధంగా పోటాపోటీగా సంబంధిత ఆశీలు వసూలు లీజులను చేజిక్కించుకుంటారు. ఇదంతా మున్సిపల్ అధికారులు, వ్యాపారుల సమక్షంలో పకడ్బందీగా జరుగుతుంది. గత వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని వ్యాపారాలకు సంబంధించి రూ.లక్షల్లో ఆదాయం వచ్చింది. ముఖ్యంగా కూరగాయల మార్కెట్ ఆశీలుకు 2022- 23లో రూ.18,76,400 లక్షలు మున్సిపాలిటీకి లీజు రూపంలో ఆదాయం వచ్చినట్లు సమాచారం. 2023- 24లో అదే కూరగాయల మార్కెట్ ఆశీలు వసూలుకు రూ.12 లక్షలకు కేటాయించారు.

లీజు రద్దుతో ఇబ్బందులు..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గడువు ముగియకుండానే లీజు రద్దు చేశారు. వెంటనే ఏడాదిలో మిగిలిన ఆరు నెలల కాలానికి గాను బహిరంగ వేలం పాట లేకుండానే రూ.2.5 లక్షలకు మాత్రమే కేటాయించారు. ఈ నెలతో కూరగాయల మార్కెట్ ఆశీలు గడువు ముగుస్తుండడంతో సంబంధిత అధికార యంత్రాంగం మళ్లీ అదే పంథాను కొనసాగించడానికి సిద్ధమైనట్లు తెలిసింది. సంద్రీ మార్కెట్ లీజును మళ్లీ తీసుకునేందుకు ప్రస్తుత లీజుదారుడు దరఖాస్తు చేసుకునేందుకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా ప్రయోజనం దక్కలేదని వాపోయాడు. ఎలాంటి పత్రికా ప్రకటన, బహిరంగ వేలం పాట లేకుండానే కూరగాయల మార్కెట్, సంద్రి మార్కెట్ ఆశీలు లీజును కేటాయింపునకు రహస్య మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. ఆశీలు రూపంలో రూ.లక్షల ఆదాయం వచ్చే మున్సిపాలిటీకి, అధికార యంత్రాంగం అవలంబిస్తున్న వైఖరిపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆర్వో ఏమన్నారంటే..

మున్సిపల్ ఆర్వో తోట వెంకటేశ్వరరావును వివరణ కోరగా ఈ నెలతో టెండరు పూర్తయింది. బహిరంగ వేలం పాట నిర్వహించాల్సి ఉంది. బుధవారం బహిరంగం వేలం నిర్వహిస్తున్న విషయం తెలియదన్నారు. ఈ విషయమై కమిషనర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా ఆయన స్పందించలేదు.

ఆర్టీసీ వద్ద పార్కింగ్ కష్టాలు



పొన్నూరు ఆర్టీసీ డిపో అభివృద్ధి బాట పడుతున్నా.. ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో వెనుకబడి ఉంది. డిపోలో పార్కింగ్ ప్రదేశం అభివృద్ధికి నోచుకోక వాహనదారులకు అసౌకర్యంగా మారింది. నిత్యం వందలాది వాహనాలు పార్కింగ్ చేసే స్థలానికి షెడ్ కరువైంది. నిర్ణయించిన రుసుము చెల్లిస్తున్నా వాహనాల భద్రత చేపట్టడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. అధికారులు స్పందించి పార్కింగ్ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పొన్నూరు

అధ్వానంగా కసుకర్రు రోడ్డు..



మండలంలోని కసుకర్రు రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. ఆ రోడ్డులో ప్రయాణం చేయాలంటే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో గుంతలలో వాహనాలు అదుపు తప్పి పడటంతో ప్రమాదాలకు గురైన ఘటనలు ఉన్నాయి. గత కొంతకాలంగా అధ్వానంగా ఉన్న రోడ్డు సమస్య తీవ్రంగా ఉన్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పొన్నూరు

29న బాజీ బాబా దర్గా ఉరుసు



పెదకాకాని బాజీబాబా దర్గా అలంకరణ

పెదకాకాని: బాజీ బాబా దర్గా ఉరుసు మార్చి 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నట్లు దర్గా ఈఓ షేక్ ముక్తార్‌బాషా తెలిపారు. గుంటూరు జిల్లా పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో నిర్వహించే బాజీ బాబా దర్గా ఉరుసుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దర్గా ఉరుసు నిర్వహణకు రాష్ట్ర వక్ఫ్ బోర్డు రూ.16 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. వేలాదిగా తరలివచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఉరుసు నిర్వహణకు వక్ఫ్ బోర్డు సూపరింటెండెంట్‌లు, సీనియర్ అధికారులు మహ్మద్ హుస్సేన్, ఇబ్రహీంబేగ్‌లతో వక్ఫ్ బోర్డు కమిటీ వేసిందన్నారు. 29వ సాయంత్రం చాందిని అలంకరణ, రాత్రి 10 గంటలకు పెదకాకాని ముస్లింపాలెం జెండా చెట్టు నుంచి వైభవంగా ఉరుసు మహోత్సవం ప్రారంభమవుతుందని చెప్పారు. అలానే 30వ తేదీ దీపారాధన, గంధం పంపిణీ, ఖురాన్ పఠనం, సలామి ప్రార్థన జరుగుతుందన్నారు. పోలీసు, పంచాయతీ, ఆరోగ్యశాఖల సమన్వయంతో వైభవంగా నిర్వహించడం జరుగుతుందని ముక్తార్ బాషా వివరించారు.



షేక్ ముక్తార్ బాషా, దర్గా ఈఓ

రైతుల నుంచే విత్తనాలు

గరికపాడు(కాకుమాను): ఈ క్రాప్ జాబితాలో పేర్లు ఉన్న రైతుల నుంచే అపరాలు(మినుము, పెసర) విత్తనాలు కొనుగోలు చేస్తారని ఏఓ కె.కిరణ్మయి అన్నారు. మండలంలోని గరికపాడు, బోడిపాలెం గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఈ క్రాప్ నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే ప్రభుత్వం మినుము, పెసలు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. జాబితాలో పేర్లు ఉన్న రైతులు ఆయా గ్రామాలలోని రైతుసేవా కేంద్రాల లోఆర్ఎస్కే సిబ్బందిని సంప్రదించాలని ఆమె సూచించారు.

శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు

గరికపాడు(కాకుమాను): గ్రామాలలో ఎవరైన శాంతి భద్రతలకు ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ భానోదయ హెచ్చరించారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన గరికపాడు, పాండ్రపాడు గ్రామాలలో మంగళవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. ఆమె వెంట ఎస్ఐ పృథ్వీ ఏక్‌నాథ్ ఉన్నారు.

ఉర్దూ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న సయ్యద్ జియావుద్దీన్

గుంటూరు లీగల్: స్థానిక కొత్తపేట ప్రభుత్వ బాలుర ఉర్దూ హైస్కూల్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ గుంటూరు కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సో చట్టంపై అవగాహన అవసరమని చెప్పారు. 15 నుంచి 18 సంవత్సరాల వయసు ఉన్న విద్యార్థులు పోక్సో బాధితులగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులకు గుడ్ టచ్, బాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. రైట్ టు ఎడ్యుకేషన్ యాక్ట్ ప్రకారం ప్రతి ఒక్క విద్యార్థికి చదువుకునే హక్కు ఉందని తెలిపారు. విద్యార్థులందరూ బాగా చదువుకొని తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని సూచించారు. జువెనైల్ జస్టిస్ యాక్ట్ గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్యానెల్ అడ్వకేట్ కట్టా కాళిదాసు భారత రాజ్యాంగం పట్ల, ప్రాథమిక హక్కుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ మొహమ్మద్ రఫీ, హెడ్ మిస్ట్రెస్ వసుంధర దేవి, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్.కె.సిద్దిఖ్, సీనియర్ టీచర్ ఫలక్ ఫాతిమా పాల్గొన్నారు.

అనుమానాదస్థితిలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: అనుమానాదస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన నల్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. షేక్ తంగెళ్ల(57) భార్య ఖాశింబితో విడిపోయి ఇరువురు వేర్వేరుగా జీవిస్తున్నారు. అడవితక్కెళ్లపాడులోని రాజీవ్‌గృహకల్పలో ఉన్న తంగెళ్ల నివాసం నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు తలుపులు పగులగొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా తంగెళ్ల మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనుమానాదస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు..

రక్షించిన పోలీసులు

లక్ష్మీపురం: తల్లిదండ్రులు లేక పోవడంతో ఉన్న ముగ్గురు అక్కలు తమ్ముడిని పట్టించుకోవడం లేదని మనస్తాపంతో విద్యుత్ స్తంభం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడిని పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు రక్షించిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. బొల్లాపల్లి మండలం, గండిగనుముల గ్రామానికి చెందిన సోమినాయక్‌కు ముగ్గురు ఆడ, ఒక మగ సంతానం ఉన్నారు. సోమినాయక్ కుమారుడు వంఖడవాత్ బర్మానాయక్ జన్మించిన నాలుగు సంవత్సరాలకే తండ్రి సోమినాయక్ మృతి చెందాడు. అయితే తల్లి కూడా నాలుగు సంవత్సరాల క్రితం అనారోగ్య కారణంగా మృతి చెందింది. బర్మానాయక్ ముగ్గురు అక్కలలో ఇద్దరు నూజివీడులో మరొకరు వినుకొండలో నివాసం ఉంటున్నారు. వీరి ముగ్గురికి వివాహాలు అయ్యాయి. అయితే బర్మానాయక్ గుంటూరులోని బ్రాడీపేటలోని హాస్టల్‌లో ఉంటూ జీఎన్‌ఎం కోర్సులో శిక్షణ పొందుతున్నాడు. ప్రతి రోజు అక్కలకు ఫోన్ చేసి అక్క పిల్లలతో మాట్లాడే ప్రయత్నం చేసిన ఎవరూ బర్మానాయక్‌తో సరిగ్గా మాట్లాక పోగా అవమానిస్తున్నారు. దీంతో బర్మానాయక్ సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో మద్యం తాగి కంకరగుంట నుంచి బ్రాడీపేట 1వ లైన్ వైపుగా వెళ్లే మార్గంలో ఉన్న విద్యుత్ స్తంభం పైకి ఎక్కి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీంతో స్థానికులు గమనించి పట్టాభిపురం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పట్టాభిపురం ఎస్ఐ రాంబాబు ఘటనా స్థలానికి చేరుకుని ముందుగా విద్యుత్ సరఫరాను నిలిపి వేసి బర్మానాయక్‌తో మాట్లాడి నచ్చచెప్పి చాకచక్యంగా స్తంభం పై నుంచి కిందకు దింపారు.

పరస్పరం దాడి చేసుకున్న ఇరువురిపై కేసు

లక్ష్మీపురం: సోదరి గదిలో వేరే వ్యక్తి ఉండటాన్ని గమనించిన తమ్ముడు ఆ వ్యక్తిని అడ్డుకునే యత్నం చేసే క్రమంలో ఇరువురు కత్తిలతో దాడి చేసుకున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. రామిరెడ్డి నగర్ ప్రాంతానికి చెందిన ఒకరు ప్రభుత్వ ఉద్యోగి. వీరికి ఇద్దరు పిల్లలు. కూతురు పీజీ చేసి ఇంట్లో ఉంటోంది. కొడుకు సోమవారం రాత్రి నెట్ క్రికెట్ ఆడేందుకు వెళ్లి రాత్రి 10.30కి ఇంటికి వచ్చాడు. తల్లిదండ్రుల నిద్రస్తున్నారు. సోదరి గదిలోకి వెళ్లాడు. అదే సమయంలో ఇంటి సమీపంలో ఆటో నడుపుకుంటూ జీవించే కట్టా సతీష్ ఇంట్లో ఉన్నట్లు గుర్తించాడు. అనుమానం కలిగిన యువతి తమ్ముడు మంచం కింద ఉన్న సతీష్‌ను చూసి కేకలు వేయడంతో పక్క గదిలో ఉన్న తల్లిదండ్రులు నిద్రలేచి వచ్చారు. అక్కడ నుంచి తప్పించుకునే యత్నం చేసిన సతీష్, దాడి చేసేందుకు ప్రయత్నించాడు. దీంతో యువతి తమ్ముడు అడ్డుకునేందుకు ప్రయత్నించాడు. కట్టా సతీష్ తప్పించుకుని పరారయ్యాడు. దీంతో గాయపడిన యువకుడిని తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మంగళవారం పోలీస్ స్టేషన్‌లో కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అదే విధంగా సతీష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్యం, డ్రెయినేజి సమస్యలు పరిష్కరించాలి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



అన్నపూర్ణనగర్‌లో రోడ్డుపైకి పారుతున్న మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని గోరంట్ల అన్నపూర్ణనగర్‌లో తీవ్రంగా ఉన్న పారిశుద్ధ్యం, డ్రైనేజి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ అన్నపూర్ణనగర్, నగరాలు, గోరంట్ల, ఎస్వీఎన్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అన్నపూర్ణనగర్లో స్థానికుల ఫిర్యాదు మేరకు పరిశీలించి, కమిషనర్ మాట్లాడుతూ ఈప్రాంతంలో డ్రెయినేజి సమస్య తీవ్రంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం మురుగునీటిని బెయిల్ అవుట్ చేయాలని ఏఈని ఆదేశించారు. పరిసరాలను పరిశీలించి నూతన డ్రెయిన్, రోడ్ నిర్మాణ పనులు మంజూరు దృష్ట్యా పనులను ప్రారంభించాలని ఆదేశించారు. డ్రెయిన్ నిర్మాణానికి ఫాల్ ఉన్న ప్రాంతం వైపు సర్వే చేయించాలని పట్టణ ప్రణాళికాధికారులను కోరారు. చిల్లీస్ జంక్షన్ వైపు నుంచి రైల్వే గేటు వైపు అవుట్ ఫాల్ డ్రెయిన్ నిర్మాణం చేయాల్సి ఉన్నందున అంచనాలు సిద్ధం చేయాలని కోరారు. ఎస్వీఎన్ కాలనీలో పలు బహుళ అంతస్తు భవనాలు రోడ్ల మీదకు ర్యాంప్‌లు నిర్మాణం చేయడం గమనించి, ట్రాఫిక్‌కు అవరోధంగా ఉన్నందున వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఆప్రాంతంలో రోడ్డులో ఉన్న చెట్టును నరికిస్తున్న ఇంటి యజమానిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం కాలంలో చెట్లు చాలా అవసరమని, చెట్లను నరికించడం చట్టరీత్యా నేరమని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రమేష్ బాబు, ఎస్ఎస్ సోమశేఖర్, ఏసిపిలు రెహ్మాన్, మల్లికార్జున, టీపీఎస్ సత్యనారాయణ, ఏఈ చైతన్య పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

ఎమ్మెల్సీ ఆలపాటి



విద్యార్థులకు నియామక పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా ఉద్యోగాలు సాధించవచ్చని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రాంగణ ఎంపికల విజయోత్సవాన్ని నిర్వహించారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్సీ, సాంకేతిక విద్యాశాఖ ట్రెనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎంవీ రామకృష్ణ చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. విద్యార్థుల ఉన్నతికి తోడ్పడిన కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ మాట్లాడుతూ చివరి సంవత్సరం పాలిటెక్నిక్ చదువుతున్న 262 మంది విద్యార్థులలో 252 మందికి వివిధ కంపెనీలలో ప్రాంగణ నియామకాల ద్వారా ఉద్యోగాలు లభించాయన్నారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులకు ఏడాదికి రూ.1.8 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు వేతనాలను అందించే విధంగా ఆయా సంస్థలు ఒప్పందం చేసుకున్నాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన వార్షికోత్సవ వేడుకల్లో వసంత ఇండస్ట్రీస్ వైస్ ప్రెసిడెంట్ కొండేపాటి హనుమంతరావు, రిటైర్డ్ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీవీ శేషాచలపతి మాట్లాడుతూ విద్యార్థులు తమ సమయాన్ని జాగ్రత్తగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నతమైన స్థానాలు సాధించేందుక ఎంతో కృషి అవసరమని కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్తును అందుకోవాలని ఆకాంక్షించారు. వేడుకల్లో భాగంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.హరీష్, అధ్యాపకులు, విద్యార్థులు అతిథులను ఘనంగా సన్మానించారు.

చిరు వ్యాపారులను ఆదుకోండి

సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి



మాట్లాడుతున్న మాల్యాద్రి

లక్ష్మీపురం: నగరంలో అనేక సంవత్సరాలుగా చిరు వ్యాపారం ప్రధాన వృత్తిగా జీవిస్తున్న వారి బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి అన్నారు. కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లోని మంగళవారం చిరు వ్యాపారుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు మెప్మా ద్వారా ఎక్కువ మంది రుణాలు తీసుకుని స్వయం ఉపాధిని పొందుతున్న వారిలో నగరపాలక సంస్థగా గుంటూరు నగరం ఎన్నికవ్వడం దానికి అవార్డును కూడా నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, విజయవాడ తుమ్మలపల్లి కలక్షేత్రంలో తీసుకోవడం జరిగిందన్నారు. అటువంటి వారిని తొలగించడం సరైనది కాదని వారి కుటుంబాల పోషణ కష్టం అవుతాయని చెప్పారు. రోడ్లకు ట్రాఫిక్ అడ్డం లేకుండా వ్యాపారాలు కొనసాగేందుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే మున్సిపల్ అధికారుల ఆదేశానుసారం సిబ్బంది వారి విలువైన బండ్లను వ్యాపార వస్తువులను, ధ్వంసం చేయడం వల్ల ఆర్థికంగా నష్ట పోతున్నారని వడ్డీ వ్యాపారులకు డబ్బు చెల్లించలేక ఆందోళన చెందుతున్నారని చెప్పారు. చిరు వ్యాపారుల యూనియన్ కార్యదర్శి దుబాయ్ వెంకటరత్నం మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాలను నగరపాలక అధికారులు పాటించడం లేదని వ్యాపారులపై దాడి సరైనది కాదని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సైదారావు పాల్గొన్నారు.

చిరువ్యాపారుల జీవితాలతో చెలగాటం వద్దు

లక్ష్మీపురం: నగరంలోని చిరువ్యాపారులతో చెలగాటం వద్దని ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులును కోరారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, జిల్లా కోశాధికారి పుప్పాల సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యామ్నాయం చూపించకుండా వ్యాపారాలు మూసివేయాలని, తోపుడు బండ్లు తీసివేయాలని హుకుం జారీ చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. కమిషనర్ పునరాలోచన చేయాలని కోరారు. లేకుంటే పేదలతో కలసి ఉద్యమించనున్నట్లు హెచ్చరించారు.

కొత్తపేట స్టేషన్‌కు సీసీ కెమెరాల వితరణ



కొత్తపేట సీఐ వీరయ్యకు సీసీ కెమెరాలు అందజేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: కొత్తపేట పోలీసుస్టేషన్‌లో అమర్చేందుకు 16 సీసీ కెమెరాలతో కూడిన ఎక్విప్‌మెంట్‌ను హిందూ ఫార్మసీ కళాశాల యాజమాన్యం వితరణ చేశారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తపేట సీఐ ఎం.వీరయ్యకు కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు 16 సీసీ కెమెరాలతో పాటు సంబంధిత ఎక్విప్‌మెంట్‌ను అందజేశారు. ఈసందర్భంగా రంగరాజు మాట్లాడుతూ సామాజికసేవ కార్పొరేట్ సంస్థల బాధ్యతగా భావిస్తూ, సివిల్, క్రిమినల్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంలో కొత్తపేట పోలీసుస్టేషన్‌కు తమ కళాశాల తరఫున సీసీ కెమెరాలను అందజేసినట్లు వివరించారు. కొత్తపేట సీఐ వీరయ్య మాట్లాడుతూ అనుమానుతిల కదలికలను గుర్తించడంతో పాటు నేరాలను నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.సీతారామయ్య, డాక్టర్ ఏ ప్రత్యూష పాల్గొన్నారు.

ఓపెన్ కరాటేచాంపియన్‌షిప్‌లో సత్తా

గుంటూరు ఎడ్యుకేషన్: జపాన్ షిటో ఆర్‌ఐయూ కరాటే స్కూల్ ఆధ్వర్యంలో ఈనెల 16న మచిలీపట్నంలో నిర్వహించిన ఆల్ ఇండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాల విద్యార్థిని సత్తా చాటినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ అండర్-12 విభాగంలో 5వ తరగతి విద్యార్థిని ఎం.లక్ష్మీ సుమేధ ట్రోఫీ కైవసం చేసుకుందని తెలిపారు. స్వీయ రక్షణకు అవసరమయ్యే ఇటువంటి క్రీడల్లో బాలికలు ముందంజలో ఉండే విధంగా తాము ప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కె.పార్వతీదేవి అభినందించారు.